## విధుల నిర్లక్ష్యంపై షోకాజ్ నోటీసులు గంగారం పీహెచ్‌సీపై డీఎంహెచ్‌ఓ ఆకస్మిక తనిఖీ



**తొలి సమయం కొత్తగూడ 07 మే 2026**

గంగారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సేవల నిర్వహణలో నిర్లక్ష్యం జరిగినట్లు వచ్చిన సమాచారం నేపథ్యంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ రవి రాథోడ్ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇటీవల జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీలో బయటపడిన లోపాలపై సమీక్ష నిర్వహించిన డీఎంహెచ్‌ఓ, విధులు సక్రమంగా నిర్వహించని స్థానిక వైద్యులు మరియు సంబంధిత సిబ్బందికి షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు.ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, విధుల పట్ల ఎలాంటి నిర్లక్ష్యాన్నీ సహించబోమని ఆయన స్పష్టం చేశారు. ఆసుపత్రిలో సమయపాలన, రోగులకు మర్యాదపూర్వక సేవలు, అవసరమైన మందుల లభ్యత, పరిశుభ్రత వంటి అంశాల్లో ఎటువంటి అలసత్వం ఉండరాదని ఆదేశించారు.జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఉపకేంద్రాల్లో పనిచేస్తున్న వైద్యులు, సిబ్బంది తమ విధులను బాధ్యతాయుతంగా నిర్వర్తించాలని హెచ్చరించారు. విధి నిర్వహణలో అలక్ష్యం కనబరిస్తే శాఖాపరమైన కఠిన చర్యలు తప్పవని తెలిపారు.ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తుందని డాక్టర్ రవి రాథోడ్ పేర్కొన్నారు.

## వెలికట్టే ధాన్యం కొనులు కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేసిన కలెక్టర్ స్నేహ శబరిష్





**తొలి సమయం / తొర్రూర్/మహబూబాబాద్ మే 7:**

తొర్రూరు పట్టణంలో నిర్మాణం పూర్తి చేసుకొని లబ్ధిదారులకు పంపిణీకి సిద్ధంగా ఉన్న రెండు పడకల గదుల ను జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ పరిశీలించారు , ఈ సందర్భంగా మిగిలిన పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేసి లబ్ధిదారులకు అందించుటకు చర్యలు తీసుకోవాలన్నారు,వెలికట్టేలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనేక ఆదేశాలు జారీ చేశారు

## కేటీఆర్ వ్యాఖ్యలపై తీవ్ర విమర్శలు: జిల్లా అధ్యక్షులు అయూబ్

**తొలి సమయం వరంగల్ 07 మే 2026**



వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్ మాట్లాడుతూ, ఇటీవల వరంగల్‌లో నిర్వహించిన రైతు సభలో కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) రాష్ట్ర ముఖ్యమంత్రిపై అనుచిత పదజాలం ఉపయోగించారని తీవ్రంగా విమర్శించారు.రాష్ట్ర రాజకీయాల్లో బాధ్యతాయుత స్థానంలో ఉన్న నాయకులు మర్యాద పూర్వకంగా మాట్లాడాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. రైతుల సమస్యలపై చర్చించాల్సిన వేదికను వ్యక్తిగత విమర్శలకు వాడుకోవడం తగదని అన్నారు. గత పాలనలో రైతులకు ఇచ్చిన హామీలు, దళితులకు మూడెకరాల భూమి, కేజీ టు పీజీ ఉచిత విద్య వంటి అంశాలు అమలు కాలేదని ఆరోపించారు.2014 నుంచి 2023 వరకు రాష్ట్రంలో రైతుల ఆత్మహత్యలు చోటుచేసుకున్న విషయాన్ని గుర్తు చేస్తూ, రైతు సంక్షేమంపై నిజాయితీగా పని చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుతం రైతు రుణమాఫీ వంటి కార్యక్రమాలు అమలు చేస్తున్న ప్రభుత్వం పట్ల అనుచిత వ్యాఖ్యలు చేయడం బాధ్యతారాహిత్యమని వ్యాఖ్యానించారు.వరంగల్ జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు కూడా ఇలాంటి వ్యాఖ్యలపై స్పందించాల్సిన అవసరం ఉందని ఆయన సూచించారు. రాజకీయ భేదాభిప్రాయాలు ఉన్నప్పటికీ, పరస్పర గౌరవాన్ని కాపాడుకోవడం ప్రజాస్వామ్యానికి అవసరమని తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

## గ్రామాల అభివృద్ధిలో ఎంపీడీవోల పాత్ర కీలకం, క్షేత్రస్థాయిలో నిత్యం తనిఖీలు నిర్వహించాలి

**- జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్**

**తొలి సమయం మహబూబాబాద్ మే 7:**



గ్రామాల అభివృద్ధిలో మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారుల పాత్ర కీలకం అని, ప్రతిరోజు క్షేత్రస్థాయిలో జరుగుతున్న అభివృద్ధి పనులు, సానిటేషన్, త్రాగునీరు సరఫరా, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాల అమలు, పెన్షన్ పరిశీలన ఆమోదం, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పురోగతి, ఓవర్ వాటర్ హెడ్ ట్యాంకర్, పరిశుభ్రత, మిషన్ భగీరథ నీరు సరఫరా, తదితర ప్రతి విభాగానికి సంబంధించిన పనులలో గ్రామపంచాయతీ కార్యదర్శులను భాగస్వామ్యులను చేస్తూ గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని ఎంపీడీవోలకు సూచించారు, పేదవాడి సొంత ఇంటి కల సహకారం చేయడం కోసం ప్రభుత్వం కేటాయించిన ఇందిరమ్మ ఇండ్ల మంజూరును నిబంధన ప్రకారం కమిటీల ద్వారా మంజూరు చేసి అందించాలని ఇప్పటికే మంజూరు చేసిన వాటి వివరాలను ఆన్లైన్లో నమోదు చేస్తూ ముందుకు వెళ్లాలని సూచించారు, మిషన్ భగీరథ ద్వారా స్వచ్ఛమైన నీరును అందిస్తూ ఇతర నీటి వనరులను ఏర్పరుచుకోవాలని ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని తెలిపారు, గ్రామస్థాయిలో ఉన్న ప్రతి ఓవర్ హెడ్ ట్యాంకులు క్లీన్ చేపిస్తూ ఉండాలని, శానిటేషన్ పై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు, గ్రామస్థాయిలో జరుగుతున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులను వేగవంతం చేయాలని, లేబర్ టర్నోవర్ పెంచాలని తెలిపారు, అంతర్గత రోడ్లు, అభివృద్ధి పనులు పల్లె ప్రకృతి వనాలు, నర్సరీలు, క్రీడా ప్రాంగణాలు, తదితర సదుపాయాలను ప్రజలకు అందిస్తూ పచ్చదనం పరిశుభ్రత పాటించాలని తడి చెత్త పొడి చెత్త వేరు చేసే విధంగా ప్రతిరోజు ఉదయం కార్యక్రమాలు నిర్వహించాలన్నారు,గ్రామాలు, పట్టణాల అభివృద్ధిలో ఉద్యోగుల పాత్ర కీలకంగా ఉండాలని, అందుకు అంకిత భావంతో పనిచేయాలని సూచించారు,ఈ సమావేశంలో జిల్లా పరిషత్ సీఈవో, (హౌసింగ్ పీడీ) పురుషోత్తం, అన్ని మండలాల ఎంపీడీవోలు తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత సమ్మర్ ఆర్చరీ కోచింగ్ శిబిర సందర్శన





**తొలి సమయం మహబూబాబాద్ మే 7**

గత పదకొండు (11) రోజులుగా ప్రభుత్వ ఉన్నత పాఠశాల (బాలుర), మహబూబాబాద్‌లో తెలంగాణ ఆర్చరీ అసోసియేషన్, ఖమ్మం మరియు వరంగల్ జిల్లాల ఆర్చరీ అసోసియేషన్స్, శ్రీ సాదుల ముత్తయ్య మెమోరియల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత సమ్మర్ ఆర్చరీ కోచింగ్ శిబిరం దిగ్విజయంగా కొనసాగుతోంది.ఈరోజు ఆ శిబిరాన్ని ఆర్చరీ అసోసియేషన్ ఆఫ్ ఇండియా డెవలప్మెంట్ కమిటీ సభ్యులు శ్రీ పుట్ట శంకరయ్య గారు, ఖమ్మం జిల్లా ఆర్చరీ అసోసియేషన్ అధ్యక్షులు మరియు శ్రీ సాదుల ముత్తయ్య గారి చారిటబుల్ ట్రస్ట్ అధినేత శ్రీ సాదుల సారంగపాణి సందర్శించారు.ఈ సందర్భంగా శిక్షణ పొందుతున్న విద్యార్థినీ విద్యార్థులకు ఆర్చరీలో పాటించాల్సిన పలు మెలకువలు, ఏకాగ్రత, క్రమశిక్షణ మరియు ఆర్చరీ క్రీడా ప్రాముఖ్యత గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ డి.ఎస్.పి. శ్రీ తిరుపతి రావు మరియు శ్రీరంగం మురళి పాల్గొని, శిక్షణ పొందుతున్న ఆర్చరీ విద్యార్థినీ విద్యార్థులకు తమ వంతు సహకారంగా ఆర్చరీ కిట్లు అందజేశారు. వారికి అసోసియేషన్ మరియు ట్రస్ట్ తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఆర్చరీ శిక్షణ కోచ్‌లు కాయం లక్ష్మణ్, బత్తుల అనిల్, శిక్షణ పొందుతున్న ఆర్చరీ విద్యార్థినీ విద్యార్థుల తల్లిదండ్రులు మరియు తదితరులు పాల్గొన్నారు.

## వినూతన పద్ధతిలో బలుపాలలో బడిబాట

**- బడిలో పిల్లలను చేర్పించే బాధ్యత మీది, బోధన బాధ్యత మాది**

**- మమ్మల్ని నమ్మండి ఒక్క చాన్స్ ఇవ్వండి బలపాల హెచ్ఎం తేలుకుంట్ల సునీత**






**తొలి సమయం మహబూబాబాద్ మే 7**

వేసవి సెలవుల్లో బడి బాటలో భాగంగా ప్రైవేటు పాఠశాలలకు వెళ్లే విద్యార్థుల తల్లిదండ్రులను కలిసి పిల్లల్ని చేర్పించే బాధ్యత మీది - బోధనా బాధ్యత మాది అని వినూతన పద్ధతికి బడి బాటకు బలపాల హెచ్ఎం తేలు కుంట సునీత స్వీకారం చుట్టారు, ఈ సందర్భంగా ఆమె అనేక క్యాప్షన్స్ తో కూడిన కరపత్రాలు తయారు చేశారు, నినాదాలు ఇలా ఉన్నాయి నాణ్యమైన విద్యను ఉచితంగా అందిస్తామని, మమ్మల్ని నమ్మి,మాకు ఒకే ఒక్క ఛాన్స్ ఇవ్వండనీ, మీ చిన్నారుల బంగారు భవిష్యత్తుకు భరోసా మాది అని హామీ ఇస్తున్నామని తెలియజేయగా ఊహించని స్పందన వచ్చిందని, అన్నారు వెంటనే స్పందించిన తల్లిదండ్రు 10 మంది పిల్లల్ని చేర్పించుటకు సుముఖత వ్యక్తం చేశారని అన్నారు.కార్యక్రమంలో బలపాల ప్రాథమిక పాఠశాల బలపాల పూర్వ, ప్రస్తుత పేరెంట్స్ . వెంకటేశ్వర్లు, .పరుశలింగం, బిక్షం, విష్ణువర్ధన్,నాగరాజు, .వెంకటేశ్వర్లు, ఉమా పాల్గొన్నారు. ఈ బడిబాట కార్యక్రమంలో పాల్గొని పైసా ఖర్చు లేకుండా మా పిల్లలు మన ఊరి ప్రభుత్వ బడిలో బాగా చదువుతున్నారంటూ, సకల సౌకర్యాలు ఉన్నాయని ప్రైవేట్ పాఠశాలలకు పంపించే పిల్లల తల్లిదండ్రులకు కరపత్రాల ద్వారా వివరించి ఒప్పించి, పిల్లల నమోదుకై కృషి చేశారని, వారు బడి బాటలో పాల్గొనడంతో తల్లిదండ్రులే మంచి ఎవిడెన్స్ అయ్యారని, వీరిని అందరూ స్ఫూర్తిగా తీసుకోవాలని ప్రధానోపాధ్యాయురాలు సునీత వారికి ప్రాథమిక పాఠశాల తరఫున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపా ధ్యాయ బృందం టి.మమత వి.జ్యోతి టి. రామారావు పాల్గొన్నారు.